ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం.. మంత్రి పొంగులేటి

➢ 7వ పేజిలో..

FRIDAY 17TH JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 121 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 17 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :121 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

- **నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం**
- **ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా**
- **సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు**
- **ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి**



భద్రాద్రి కొత్తగూడెం,జూలై16: గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో

➢ మిగతా 2వ పేజిలో..



## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- **ఎంపిలకు కొత్త మార్గదర్శకాలు జారీ**

న్యూఢిల్లీ,జూలై16 ఈ నెల 20 నుంచి ఆగస్టు 17 వరకు అత్యంత ప్రాధాన్యంతో జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాల ను జారీ చేస్తూ అధికారిక బులిటెన్ విడుదల చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం

➢ మిగతా 2వ పేజిలో..

## జగన్నాథ రథయాత్రలో అపశృతి

- **తొక్కిసలాటలో ఊపరిడక ఒకరు మృతి**
- **వందమందకి పైగా భక్తులకు గాయాలు**



పూరీ,జూలై16 ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి

➢ మిగతా 2వ పేజిలో..




## గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

- **అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు**
- **కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు**
- **వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ**

➢ 2వ పేజిలో..



## పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

**నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై16 దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్

➢ మిగతా 2వ పేజిలో..

## మమతా బెనర్జీకి వరుస షాక్‌లు

- **టిఎంసికి, రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ రాజీనామా**
- **ఛైర్మన్ రాధకృష్ణకు రాజీనామా అందచేత**




కోల్‌కతా,జూలై16 తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులూతనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ

➢ మిగతా 2వ పేజిలో..

# ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

- **అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం**
- **రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు**

న్యూఢిల్లీ,జూలై16: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేం దుకు అంతరిక్ష విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక నిర్ణయం తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల



రాజీనామాతో జాతీయ

➢ మిగతా 2వ పేజిలో..

# 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యా÷-జడెట్లనూ అనుమతించరు. కేవలం సాంకేతిక ఆంక్షలకే పరిమితం కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రజాస్వామ్య యుతమైన గౌరవాన్ని కాపాడేందుకు మరికొన్ని కఠిన నిబంధనలనూ ఈ బులిటెన్‌లో చేర్చారు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపీలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం ఈ విస్తృతమైన మార్గదర్శకాల ద్వారా కోరింది.

# పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రెన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిందర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రబ్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

## ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

హైదరాబాద్,జూలై16 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

## హైదరాబాద్ నుంచి కర్నాటకకు రేషన్ బియ్యం

### ఐదుగురు వ్యక్తుల ముఠాను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్,జూలై16 తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ముఠా గుట్ట రట్టు చేశారు గచ్చిబౌలి పోలీసులు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 220 టన్నుల రేషన్ బియ్యం, 40 బ్యాగుల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ బియ్యం, గోధుమలు తరలిస్తున్న 4 లారీలు, 4 టాటా ఏస్ వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కంట్రోల్ యాక్ట్ - 2016 కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. గౌలిదొడ్డి నుంచి కర్ణాటకకు ఈ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. నిందితులను విచారిస్తున్నామని పేర్కొన్నారు. వారి నుంచి వివరాలు రాబడుతున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ విభాగంలోని అధికారులతోపాటు గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా ఈ దాడి నిర్వహించారు.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మమతా బెనర్జీకి వరుస షాక్‌లు

నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100? లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మానాన్ను కూడా ప్రదానం చేసింది. టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

# జగన్నాథ రథయాత్రలో అపశృతి

తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

# ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది. ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్‌సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్‌సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.

# గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ



హైదరాబాద్,జూలై16 గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి..

### సమీక్షల కోసం క మిటీ సభ్యులే జిల్లాలకు రావాలి

### మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

హైదరాబాద్,జూలై16 తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ గురువారం అమరవీరుల స్మారక చిహ్నంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు. సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే పక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు. ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. 'మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తక్షణమే తీసుకెళ్తామని అన్నారు. ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి న్యాయం జరిగేలా చూస్తాం' అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.

# పోచమ్మ దేవాలయంలో నూతన బోరు ప్రారంభం



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జులై 16/ అక్షరం న్యూస్ –:

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి 24 వ వార్డు పోచమ్మ గుడి దేవాలయంలో గురువారం నాడు నూతనంగా వేసిన బోరును అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి సదానందం యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ గుడి దేవాలయంలో వాటర్ ప్రాబ్లం ఉందని ఊరు మందమర్రికి చెందిన మహిళలు తమ దృష్టికి తీసుకుని రాగా వెంటనే కార్మిక మంత్రి వివేక్ వెంకట స్వామికి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెంటనే స్పందించి సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి వెంటనే బోరు వేయడం జరిగిందన్నారు. పోచమ్మ గుడి దేవాలయంలో నీటి సమస్య తీర్చడం పట్ల 24వ వార్డు ప్రజలు సంతోషంతో మంత్రి వివేక్ వెంకటస్వామి కి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మంద తిరుమలరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడి మల్ల నర్సింగ్, దుర్గం ప్రభాకర్, నాగుల దుర్గయ్య, సత్తన్న తోట రాజు, అందెల రాజన్న, సంజీవ్, విజయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, 24 వ వార్డుల ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్-1 సాధించడం గర్వకారణం

- డీఎస్పీ ప్రవీణ్ కుమార్ ను అభినందించిన జీఎం ఎన్. రాధాకృష్ణ



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/జూలై 16/ అక్షరం న్యూస్ –:

సింగరేణి కార్మికులు కష్టపడి పనిచేస్తూనే, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ మైన్ (కెకె ఓసిపి ) లో కన్వేయర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డి. రవీందర్ కుమారుడు డి. ప్రవీణ్ కుమార్ ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) గా ఎంపికయ్యారు. పెద్దపల్లిలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న ప్రవీణ్ కుమార్‌ను, ఆయన తండ్రి రవీందర్‌ను మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ ఒక సాధారణ సింగరేణి కార్మికుడైన రవీందర్ తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించి, ఇంతటి ఉన్నత స్థాయికి చేర్చడం అభినందనీయమన్నారు. డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్ కుమార్ తన వృత్తి జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఉత్తమ సేవలు అందించాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.సింగరేణి కార్మికులందరూ గనుల్లో రక్షణ సూత్రాలు పాటిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించాలని, తమ కుటుంబాలకు అండగా ఉంటూ పిల్లల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జీఎం సూచించారు.ఈ కార్యక్రమంలో డీజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్ పాల్గొన్నారు.

# పరిసరాల విజ్ఞానం వర్క్ షీట్స్ బుక్ విడుదల



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై16/ అక్షరం న్యూస్ –:

విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమైన మూడవ తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకానికి అనుగుణంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఫిట్టర్ బెడ్ ఉపాధ్యాయులు భీంపుత్ర శ్రీనివాస్ జలంపెల్లి తయారుచేసిన మూడవ తరగతి పరిసరాల విజ్ఞానం వర్క్ షీట్ పుస్తకం మరియు రెండు నుండి 5వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరమైన పరిసరాల విజ్ఞానం బేసిక్ వర్క్ షీట్ పుస్తకాలను మందమర్రి మండల విద్యాధికారి రాథోడ్ రమేష్ చేతులమీదుగా విడుదల చేసారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎంతో శ్రమకు ఓర్చి రాసిన ఈ రెండు పుస్తకాలను విడుదల చేస్తూ విద్యార్థులు వీటిని వినియోగించుకొని బాగా చదువుకొని ఎదగాలని ఆయన అన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం గత రెండు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడు భీంపుత్ర శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాధికారి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస చారి, ఉమాదేవి, లలిత, రవి విద్యార్థులు పాల్గొన్నారు.




# భక్తి--సేవ--ఐక్యతకు నిదర్శనంగా అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ





- **ఎన్‌టీపీసీలో నూతన శాఖ ఏర్పాటు.. గౌరవ అధ్యక్షుడిగా వేదపండితుడు రాంపల్లి వామనశర్మ ఏకగ్రీవ ఎన్నిక**

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: జ్యోతినగర్‌లోని ఎన్‌టీపీసీ పీటీఎస్ వైకుంఠపురం శ్రీ హరిహర దేవాలయ ప్రాంగణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఎన్‌టీపీసీ నూతన శాఖ సమావేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛంద సేవకుల కమాండెంట్ జనగామ తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సమావేశానికి ముందు ఆలయ ప్రధాన అర్చకుడు, ప్రముఖ వేదపండితుడు బ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అయ్యప్ప పూజ, పుష్పార్చన, దీపారాధన నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారుఅనంతరం జరిగిన సమావేశంలో రాబోయే మండల పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు పెద్దపల్లి జిల్లాలో సంస్థను మరింత బలోపేతం చేయడంపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా నూతన శాఖ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా బ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ, అధ్యక్షుడిగా చిప్ప కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మారీడు మురళీకృష్ణ, కార్యదర్శిగా సట్టు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కంది ఆంజనేయులు, కోశాధికారిగా బల్గం రవీందర్‌గౌడ్, స్వచ్ఛంద సేవకుల

వీ సా ల

నాయకుడిగా మనిషిలో






ర వా కాం త్ ,

కేంద్ర ఎన్నికల సభ్యుడిగా జాడి రాజేశం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వాణమామలై రామాచారి, పాపిట్ల రాజనరేంద్ర శర్మ, కే. రామకృష్ణ, దువాసి నారాయణ, యార రాము, అరెళ్ల వేణుగోపాల్‌గౌడ్, తనుగుల రాజు, బొద్దుల శ్రీనివాస్, కంది రణధీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన సభ్యులు "భక్తుల సేవయే మాధవ సేవ" అనే లక్ష్యంతో ఆలయ అభివృద్ధి, భక్తులకు సేవ, సమాజ హిత కార్యక్రమాల కోసం నిస్వార్థంగా పనిచేస్తామని ప్రమాణం చేశారు. స్వామివారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం నిర్వహించి బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా రాంపల్లి వామనశర్మ మాట్లాడుతూ, "తత్వమసి" అనే మహావాక్యాన్ని ఆచరించే పవిత్ర క్షేత్రం అయ్యప్ప సంప్రదాయమని, మండల దీక్ష

క్ర మ శి క్ష ణ,

సమానత్వం, సేవాభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ చేపడుతున్న సేవా కార్యక్రమాలే అయ్యప్ప స్వామికి నిజమైన నైవేద్యమని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు నిస్వార్థ సేవతో స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఎన్‌టీపీసీ శాఖ పదాధికారులు, సభ్యులు, గురుస్వాములు ఉప్పరి రమణయ్య, దీక్షిత్ శ్రీనివాస్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహాప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమం భక్తి పారవశ్య వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నా భర్త నుంచి నాకు పిల్లలకు ప్రాణహాని

- రక్షణ కల్పించాలని మహిళ విజ్ఞప్తి.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/జూలై 16/అక్షరం న్యూస్ –:

తన భర్త వల్ల తనకు, తన ఇద్దరు పిల్లలకు ప్రాణహాని ఉందని, అధికారులు వెంటనే స్పందించి రక్షణ కల్పించాలని షిర్కే ఏరియాకు చెందిన స్వరూప రాణి కోరారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2012లో చీకటి శ్రీశైలంతో తన వివాహం జరిగిందని, అప్పటి నుంచి భర్త ఎలాంటి పని చేయకుండా తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె ఆరోపించారు. వివాహానికి ముందు అతడు మరో ఇద్దరు మహిళలను వివాహం చేసుకున్న విషయం తనకు తెలియదని, మోసపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆరోగ్యమిత్రగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తున్నానని తెలిపారు. ఇటీవల తన భర్త నుంచి తనకు బెదిరింపులు వస్తున్నాయని, అతని బావ చంద్రమౌళి కూడా అతనికి సహకరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని చెప్పారు. తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని, వెంటనే రక్షణ కల్పించి న్యాయం చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆమె కోరారు.

# వర్షాలు కురవాలని ఇబ్రహీంపూర్‌లో గ్రామ దేవతలకు ప్రత్యేక జలాభిషేకం





జనగామ జిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) జులై 16: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామం లో సకాలం లో సమృద్ధి గా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామ బొడ్రాయి, గ్రామ దేవతలకు,గ్రామ మైసమ్మ తల్లికి ప్రత్యేక జలాభిషేక కార్యక్రమాన్నినిర్వహించారుఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలునిర్వహించి, గ్రామానికి మంచి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలందరూసుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తిపూర్వక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింత నరేష్ వార్డు మెంబర్లు గ్యార నవనీత, మేడిపల్లి భార్గవి, దొరగోళ్ళ లక్ష్మమ్మ ,ఇంగోలా మల్లేష్ పండుగ సునీత, నూనె ఉప్పలయ్య బర్ల బాలురాజు,మాజీ సర్పంచ్ కాసర్ల లక్ష్మయ్య పబ్బ శేఖర్ మేడిపల్లి నరేష్,కొండ అశోక్,నల్ల నవీన్ గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత

- గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో దయనీయ స్థితి... మందుల కొరత
- రోగులకు దక్కని పూర్తి ఉచిత వైద్యం.. బయట కొనుక్కోవాల్సిందేనా?
- సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర ఆగ్రహం



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ప్రభుత్వ ఆసుపత్రులంటే పేద ప్రజలకు భరోసా ఇచ్చేలా ఉండాలి కానీ, వారి ప్రాణాలతో చెలగాటం ఆడేలా మారకూడదని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరైన రీతిలో పూర్తిస్థాయి మందులు అందడం లేదని, వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్‌లో కేవలం కొన్ని రకాల మందులు మాత్రమే ఆసుపత్రి కౌంటర్‌లో లభిస్తున్నాయని ఆయన ఆరోపించారు. మిగిలిన అత్యవసర మందుల కోసం రోగులు విధిలేక బయట ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోందని మండిపడ్డారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులలో అత్యధికులు తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేదలే ఉంటారని డా॥ నగేష్ గుర్తు చేశారు. నిరంతరం వాడాల్సిన మందులను ప్రతి నెలా బయట వేలాది రూపాయలు పోసి కొనుగోలు చేయడం పేద కుటుంబాలకు భారం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఒక నెలకు మందులు కొని, తదుపరి నెలకు డబ్బులు లేక మందులు వాడటం ఆపేస్తే రోగుల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చి కూడా మందులు దొరక్కపోతే, మానసికంగా రోగులు మరింత కుంగిపోతారని ఆవేదన చెందారు.

## ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించాలి!

వైద్య రంగంలో పేదవాడు నలిగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు వెంటనే స్పందించి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదురవుతున్న ఈ మందుల కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. వైద్యులు రాసే ప్రతి ఒక్క మందు ఆసుపత్రిలోనే ఉచితంగా లభించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని డా॥ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

## కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: జూపాక శ్రీనివాస్




జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర కమిటీ నాయకుడు రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయంలో స్మారక సభ నిర్వహించారు. పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రాయల చంద్రశేఖర్ విప్లవ ఉద్యమానికి జీవితాంతం అంకితమై పనిచేశారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తూ విద్యార్థి దశ నుంచే ఉద్యమ బాట పట్టారని తెలిపారు. అత్యవసర పరిస్థితి కాలంలో అజ్ఞాత జీవితం గడుపుతూ పార్టీ కోసం పనిచేశారని, అనంతరం ఇల్లందు, మహబూబాబాద్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించి రైతు ఉద్యమాలను బలోపేతం చేశారని అన్నారు.అతివాద, మితవాద ధోరణులకు వ్యతిరేకంగా సిద్ధాంతపరమైన పోరాటం సాగిస్తూ ప్రజాపంథానే సరైన మార్గమని విశ్వసించి చివరి వరకు అదే సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని కొనియాడారు. ఆదివాసీలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమంలో కూడా కీలక పాత్ర పోషించారని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ మార్పు కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈసంపల్లి రాజేందర్, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, బుషిపాక దేవయ్య, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాధ, ఇనుగాల రాజేశ్వర్, కలువల రాయమల్లు, క్రాంతి, రాజయ్య, దీవెనమ్మతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి కాలరీస్ కంపెనీ రామగుండం ఆర్జీ-1 ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆర్సీఓఏ క్లబ్‌లో ఈ శిబిరం జరుగుతుంది.హైదరాబాద్‌కు చెందిన మాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నారు. చర్మవ్యాధులు, మోకాళ్ల నొప్పులు, గుండె దడ, అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, ఆస్తమా, మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందజేస్తారు. వైద్యుల సేవలు ఉచితంగా అందుబాటులో ఉండగా, మందులకు మాత్రమే నామమాత్రపు ధర వసూలు చేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలు, పారిశ్రామిక ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. మరిన్ని వివరాలకు డాక్టర్ విశ్వనాథ మహర్షిని 98495 74706 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించింది.

## పదోన్నతితో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే పోలీసు శాఖలో పదోన్నతి పొందిన ప్రతి పోలీసు అధికారిపై బాధ్యత మరింత పెరుగుతుందని, అప్పగించిన విధులను సమర్థవంతంగా, నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఎ.సత్తయ్య, పి.వెంకన్న గౌడ్, ఎం.ఎ.హబీబ్ గురువారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతి పొందడం ప్రతి ఉద్యోగికి గర్వకారణమని, అయితే దానితో పాటు బాధ్యత కూడా మరింత పెరుగుతుందని అన్నారు.విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ,క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

# ప్రశాంత్ నగర్ శ్రీనగర్ కాలనీలో నగర మేయర్ పర్యటన





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పురోగతి లో ఉన్న పలు అభివృద్ధి పనులను పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం , మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి గురువారం రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రశాంత్ నగర్ లో ఒక వీధిలో డ్రైనేజ్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం దృష్టికి తీసుకురాగా సెంట్రల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ తో పాటు రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే శ్రీ నగర్ కాలనీ లో కూడా అత్యవసరంగా కల్వర్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. అమృత్ జలాశయాల పునరుజ్జీవన పథకంలో భాగంగా మల్కాపూర్ చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పనుల్లో వేగం పెంచాలని యంత్రాలు ,పని వాళ్ళను ఎక్కువ సంఖ్యలో వినియోగించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహిశీచడానికి న్యూ పోరట్ పల్లి లో స్థల పరిశీలన చేశారు . ఈ సందర్భంగా ఆయన వెంట కార్పొరేటర్లు వడ్లూరి రవి , వెంగళబాపు , నాయకులు భరత్ గౌడ్ , అభిషేక్ , నగర పాలక సంస్థ టి పి ఎస్ నవీన్ , ఎ ఇ తేజస్విని , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఎ ఇ లు మౌనిక , మనోజ్, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు కృపాకర్ రావు తదితరులు ఉన్నారు.





# విద్యార్థి మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి






- **డివైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లింగాపూర్ మోడల్ హైస్కూల్లో బుధవారం రోజు ప్రమాదవశాత్తు స్కూల్ వెనకాల నీటి గుంతలో పడి మృతి చెందిన 8వ తరగతి విద్యార్థి మృతి పై లోతైన సమగ్ర విచారణ నిష్పక్షపాతంగా జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.గురువారం రోజు బాలుడు మృతి చెందిన సంఘటన స్థలాన్ని జిల్లా కమిటీగా పరిశీలించటం జరిగిందని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని జిల్లా కార్యదర్శి కొంటు సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రగిరి కృష్ణకుమార్, జిల్లా కమిటీ నాయకులు మొగిలిచర్ల సురేష్, సూర్య అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు మోడల్ స్కూల్ ల పైన ప్రత్యేక శ్రద్ధ వహించి అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో సార్లు వేదికల పైన చెబుతూ ఉన్న ఆచరణలో మాత్రం విద్యార్థుల ప్రాణాలే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులు కనబడతా ఉన్నాయి. లింగాపూర్ మోడల్ స్కూల్ ఘటనలో కేవలం ప్రధాన ఉపాధ్యాయులనే సస్పెండ్ చేయడం కాదని సంబంధిత ఉన్నత అధికారుల మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ప్రతి నెల తనిఖీలు చేస్తా ఉన్న కానీ ఇలాంటి అనుకోని సంఘటనలు జరగడం పైన తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అని వారి సందర్భంగా అన్నారు. పాఠశాల లోపల ప్రాంతంలోనే సీసీ కెమెరాలు ఉన్నాయి తప్ప స్కూలు పరిసర ప్రాంతాల లో సీసీ కెమెరా లేకపోవడం ఈ సంఘటనకు ప్రధాన కారణమని వారన్నారు. అంతే కాకుండా ఉన్నతాధికారులు ఏదో మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించారు తప్ప ఎప్పుడూ కూడా ఈ స్కూలు ప్రాంత పరిసరరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుని ఉంటే ఇటువంటి ఘటన జరిగి ఉండేది కాదని వారి సందర్భంగా అన్నారు. పాఠశాల ప్రహరీ గోడ పైన రక్షణ చర్యలు లేకపోవడం సంఘటనకు ఒక కారణమని వారన్నారు. స్కూలు వెనుక భాగంలో ఎవరో కొంతమంది వ్యక్తులు కొద్దికొద్దిగా అక్రమంగా మట్టిని తరలించకపోవడం తద్వారా అక్కడ పెద్ద గుంత ఏర్పడి అందులో వర్షపు నీరు నిలువ ఉండడం ద్వారా ప్రమాదవశాత్తు బాలుడు అందులో పడి మరణించడం జరిగిందని ఆ భూమి యొక్క ఎవరైతే సంబంధిత వ్యక్తులు ఉంటారో దాని చుట్టూ ఎటువంటి రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం కూడా కారణమని వారి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా అన్నారు. కాబట్టి ఈ ఘటన పైన కేవలం స్కూలు యొక్క ప్రధాన ఉపాధ్యాయుల ఇద్దరినీ పైనే చర్యలు తీసుకోవడం కాకుండా స్థానిక కలెక్టర్ గారు ఆర్డీవో గారు ఎమ్మెల్యే గారు లోతైన సమగ్ర విచారణ జరిపించి సంబంధిత ఉన్నత అధికారుల మీద ఆ భూమి యొక్క యజమాని పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు.

## కార్మికుల ఆశాజ్యోతి పీజేఆర్ కాంస్య విగ్రహావిష్కరణ

- **హాజరైన పీజేఆర్ కుమార్తె విజయ రెడ్డి**
- **ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ.**

శేరిలింగంపల్లి ప్రతినిధి: చందానగర్ డివిజన్ లోని పీజెఆర్ స్టేడియం ఆవరణలో జననేత, మాజీ మంత్రి, దివంగత పి. జనార్ధన్ రెడ్డి కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ, స్వర్గీయ పీ.జనార్ధన్ రెడ్డి కుమార్తె ఖైర్తాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పీ.విజయ రెడ్డి, యాదవ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, తాజా, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ లు కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మంత్రి, ఎమ్మెల్యే ఇతర ప్రముఖులతో కలిసి పిజెఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ...స్వర్గీయ మాజీ మంత్రి పి. జనార్ధన్ రెడ్డి తన రాజకీయ జీవితమంతా పేదల పక్షపాతిగా, కార్మికుల ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి, ముఖ్యంగా చందానగర్, శేరిలింగంపల్లి ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన పి.జె.ఆర్ సేవలు నేటి తరం నాయకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం పీ.జె.ఆర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ డైలీ పార్లర్ ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితర డివిజన్ల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, పి.జె.ఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కరవు నివారణకు ముల్కనూర్‌లో రుద్రాభిషేకం- వరుణ యాగం నేడు

- **వర్షాల కోసం గ్రామస్తుల సామూహిక ప్రార్థనలు.. మహిళలు రైతులు ప్రజలకు పాల్గొనాలని పిలుపు.**



హనుమ కొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై16/అక్షరం న్యూస్:–

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోనిముల్కనూర్ గ్రామం పరిసర ప్రాంతాల్లో వర్షాభావం కారణంగా కరవు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని సంకల్పిస్తూ గ్రామంలో నేడు రుద్రాభిషేకం వరుణ యాగం నిర్వహించనున్నట్లు గ్రామ పురోహితులు నాగిళ్ళ నాకిష్టమూర్తి శర్మ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి భూలక్ష్మి అమ్మవారు పోచమ్మతల్లి ఆలయం పాత శివాలయం కొత్త శివాలయంలో స్వామివారికి జలాభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి పాత శివాలయంలో వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించనున్నారు. ఈ యాగానికి పెద్ద సంఖ్యలో వేద బ్రాహ్మణులు హాజరవుతున్నారని గ్రామ ప్రజలు తమకు తోచినంత నెయ్యిని పాత శివాలయం వద్ద అందజేసి యాగంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. అలాగే సంప్రదాయంగా నిర్వహించే కప్పతల్లి ఆట కూడా గ్రామంలో నిర్వహించబడుతుంది. కప్పతల్లి మీ ఇంటి వద్దకు వచ్చినప్పుడు దానిపై నీళ్లు పోసి వర్షాలకు ఆహ్వానం పలకాలని గ్రామస్థులను కోరారు. గ్రామ రైతులు, మహిళలు, మహిళా సంఘాల సభ్యులు, యువత చిన్నారులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు, పురోహితులు నాగిళ్ళ నాకిష్టమూర్తి శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ యాగం ద్వారా గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి, రైతులకు మంచి పంటలు పండడంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కుల వృత్తుల పరిరక్షణ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కుల వృత్తుల మేళా ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ కుల వృత్తుల ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ఎమ్మెల్యే, సంప్రదాయ వృత్తులకు చెందిన ఉత్పత్తులను పరిశీలించి కళాకారులు, వృత్తిదారులను అభినందించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో సంప్రదాయ వృత్తులకు కొత్త ఊపు లభిస్తోందని పేర్కొన్నారు. అనంతరం పూసర్ల కులానికి చెందిన స్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, అక్కడ తయారు చేసిన పూసల దండలను కొనుగోలు చేసి పలువురు ఎమ్మెల్యేల సతీమణులకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారి ఉత్పత్తులను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, పలు సంస్థల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఒక రోజు విరామం -- 77 ఆవాసాలు, రెండు మున్సిపాలిటీలకు తాత్కాలిక అంతరాయం



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 16: అక్షరం న్యూస్

అవంతిపురం 90 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం (డబ్ల్యూటీపీ) నుంచి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి తాగునీటిని సరఫరా చేసే 700 డీఐ ప్రధాన పైప్‌లైన్‌లో చిల్లేపల్లి చెరువు వద్ద లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీ మరమ్మత్తు పనులను జూలై 17న చేపట్టనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఉపవిభాగం, మిర్యాలగూడ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ తెలిపారు. మరమ్మత్తు పనుల కారణంగా నేరేడుచర్ల (18), గరిడేపల్లి (30), పాలకీడు (16), హుజూర్‌నగర్ (7), మేళ్లచెరువు (6) మండలాలకు చెందిన మొత్తం 77 ఆవాసాలతో పాటు నేరేడుచర్ల, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు ప్రత్యామ్నాయంగా బోర్ నీటిని అందించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను కోరారు. బోర్ నీటిని సరఫరా చేసే ముందు సంబంధిత నీటి ట్యాంకులకు తప్పనిసరిగా క్లోరినేషన్ నిర్వహించి అనంతరం మాత్రమే ప్రజలకు నీటిని పంపిణీ చేయాలని సూచించారు. ఈ విషయంలో స్థానిక సంస్థలు తగిన చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# చందానగర్ లో పీజేఆర్ కాంస్య విగ్రహావిష్కరణ





- **హాజరైన పీజేఆర్ కుమార్తె విజయ రెడ్డి**
- **ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ.**

శేరిలింగంపల్లి సుఫల అక్షరం ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ లోని పీజెఆర్ స్టేడియం ఆవరణలో జననేత, మాజీ మంత్రి దివంగత పి. జనార్ధన్ రెడ్డి కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ, స్వర్గీయ పీ.జనార్ధన్ రెడ్డి కుమార్తె ఖైర్తాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పీ.విజయ రెడ్డి, యాదవ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, తాజా, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ ప్రముఖులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మంత్రి, ఎమ్మెల్యే ఇతర ప్రముఖులతో కలిసి పిజెఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ...స్వర్గీయ మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి తన రాజకీయ జీవితమంతా పేదల పక్షపాతిగా, కార్మికుల ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి, ముఖ్యంగా చందానగర్, శేరిలింగంపల్లి ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన పి.జె.ఆర్ సేవలు నేటి తరం నాయకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం పీ.జె.ఆర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ డైలీ పార్లర్ ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితర డివిజన్ల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, పి.జె.ఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డెక్కిన గిరిజన గురుకుల విద్యార్థినులు

- **పేద, గిరిజన బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలోనే చదువు కంటే కష్టాలే ఎక్కువయ్యాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.**



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ జులై 16(అక్షరం న్యూస్ ) పేద, గిరిజన బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలోనే చదువు కంటే కష్టాలే ఎక్కువయ్యాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీనగర్ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై గురువారం విద్యార్థినులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రారంభమై నెల రోజులు గడిచినా తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని, వినియోగానికి తగిన బాత్రూంలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు ఆరోపించారు. ఉదయం నిద్రలేవగానే వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా నీళ్లు లేవు, బాత్రూములు వాడలేం. తాగడానికి కూడా మంచినీళ్లు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో చదువు ఎలా సాగుతుంది? అంటూ పలువురు విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. బాత్రూం వినియోగానికి లేకపోవడంతో బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోందని, అక్కడ పాముల సంచారం ఉండటంతో భయాందోళనల మధ్య కాలం గడుపుతున్నామని వారు తెలిపారు. సమస్యను పలుమార్లు పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని ఆరోపించారు. టాయిలెట్స్ మరమ్మతుల కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.10 చొప్పున వసూలు చేశారని, అయినప్పటికీ పనులు చేపట్టలేదని విద్యార్థినులు పేర్కొన్నారు. అలాగే సమస్యలు బయటకు చెబితే అంతర్గత మార్కులు తగ్గిస్తామని, బయట చెప్పవద్దని ప్రిన్సిపాల్ హెచ్చరించారని కూడా ఆరోపించారు. ఈ కారణంగా ఇంత కాలం మౌనంగా ఉన్నామని, ఇక భరించలేక రోడ్డెక్కామని చెప్పారు. ఆందోళన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించి విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కొత్తగూడ మండల అధ్యక్షుడు బానోత్ రూప్ సింగ్ సమస్యను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సీతక్క వెంటనే స్పందించిన మంత్రి సీతక్క విద్యార్థినులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలు తేలిన మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే తాగునీరు తదితర సమస్యలను 12 గంటల్లో పరిష్కరించేలా అధికారులను ఆదేశిస్తామని, “మీకు నేను అండగా ఉంటాను.. ఎలాంటి భయం అవసరం లేదు” అంటూ విద్యార్థినులకు భరోసా కల్పించారు. మంత్రి హామీతో విద్యార్థినులు తమ ఆందోళనను విరమించారు. అయితే గురుకులంలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.

## ఎం.పి.పి.ఎస్. సిద్ధిక్ నగర్‌లో హెచ్‌పీసీఎల్

# ఆధ్వర్యంలోస్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమం



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్య నగర్ డివిజన్ హెచ్‌పీసీఎల్ సంస్థ వారి బృందం ఆధ్వర్యంలో ఎం.పి.పి.ఎస్. సిద్ధిక్ నగర్ పాఠశాలలో “స్వచ్ఛ భారత్ అభియాన్” అంశంపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను తమ వ్యాసాల ద్వారా చక్కగా వివరించారు. విజేతలకు హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రత్యేక బహుమతులను అందజేసి అభినందించింది. అనంతరం విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు తోలుబొమ్మల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులువిద్యార్థులు పాల్గొన్నారు. ఈ విలువైన కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించిన హెచ్‌పీసీఎల్ సంస్థ వారి బృందానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసిన సంజయ్ కుమార్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 16/ అక్షరం న్యూస్–:

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుని గురువారం పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం టిడిపి అధ్యక్షులు ఇంచార్జీ బి. సంజయ్ కుమార్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో విమానాశ్రయాలకు పెద్ద పీటవేస్తామని మంత్రి ప్రకటించడం అభినందనీయమని ఈ సందర్భంగా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పంటల రక్షణకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి

- **మంత్రి పొన్నం ఆదేశాలతో కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల వినతి..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 16/అక్షరం న్యూస్:–

ఎల్కతుర్తి– భీమదేవరపల్లి మండలాల రైతుల పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ నార్త్ దేవాదుల కాలువ ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రస్తుత కరువు పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున అత్యవసరంగా సాగునీటిని విడుదల చేయాలని కోరారు. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రైతుల పంటలకు నష్టం కలగకుండా అవసరమైన సాగునీటిని తక్షణమే విడుదల చేసే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అధికారులు త్వరితగతిన స్పందించి సాగునీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, ఎల్కతుర్తి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, అశోక్ ముఖర్జీ, ఉసకోయిల ప్రకాష్, వెంకన్న, గాలయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోపనపల్లిలో అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి:

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల నుండి గోపన్ పల్లి వరకు ఇస్కాన్ సైబరాబాద్ హరే రామ హరే కృష్ణ వారి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ జగన్నాథ స్వామి రథ యాత్ర ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్కాన్ (ఇస్కాన్) రథ యాత్ర అనేది జగన్నాథ స్వామి, బలరాముడు, సుభద్రల పూజల కోసం నిర్వహించే ఒక వైభవోపేతమైన ఆధ్యాత్మిక ఉత్సవం. ఈ వేడుకల్లో భాగంగా అలంకరించిన భారీ రథాలను భక్తులు వీధుల్లో లాగుతూ భజనలు, సంకీర్తనలు చేస్తారు అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు అద్భుతమైన జగన్నాథ రథయాత్ర పండుగను జరుపుకుంటున్నారు . ఈ పవిత్రమైన రోజున, విశ్వనాథుడు తన ఆలయం నుండి కరుణతో బయటకు వచ్చి, కుల, మత, నేపథ్య భేదం లేకుండా ప్రతి ఒక్కరిపై తన ఆశీస్సులను కురిపిస్తాడు అని గాంధీ తెలియచేశారు. భక్తులు భక్తితో రథాన్ని లాగుతూ, జగన్నాథ స్వామి సమస్త అడ్డంకులను తొలగించి, వారి హృదయాలను పవిత్రపరిచి, కృష్ణ చైతన్యం ప్రేమపూర్వక భక్తి సేవ ద్వారా వారిలో తనను తాను సుస్థిరంగా స్థాపించుకోవాలని ప్రార్థిస్తారు. భగవంతుడు తన భక్తుల ప్రేమను స్వీకరించడానికి ఎల్లప్పుడూ ఆసక్తిగా ఉంటాడని రథయాత్ర మనకు గుర్తు చేస్తుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, దూబే, అనిల్, ప్రభాకర్ రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు తదితరలు పాల్గొనారు.

# ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లో భక్తిశ్రద్ధల మధ్య పూరి జగన్నాథ రథయాత్ర





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లోని జగన్నాథ ఆలయం నుంచి గురువారం సాయంత్రం పూరి జగన్నాథ రథయాత్ర భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ప్రారంభమైంది. రామగుండం ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని ప్రారంభించారు. ప్రారంభానికి ముందు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అమ్మవారికి వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం అలంకరించిన రథంలో ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్రను ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగుతూ స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాల మీదుగా సాగిన రథయాత్రకు మహిళలు, చిన్నారులు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు. మార్గమధ్యంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి, పూలతో స్వామివారిని ఆహ్వానించారు. భక్తి గీతాలు, నామసంకీర్తనలతో టౌన్‌షిప్ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రలో ఒడిశా సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. పూరి జగన్నాథ రథయాత్రకు హిందూ సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉందని, ఈ యాత్రలో పాల్గొని రథాన్ని లాగడం వల్ల శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి ఏడాది నిర్వహించే ఈ వేడుక ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లో భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ అధికారులు, ఉత్కల్ సమాజ్ ప్రతినిధులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది





- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: కుల వృత్తుల పరిరక్షణ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కుల వృత్తుల మేళా ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ కుల వృత్తుల ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ఎమ్మెల్యే, సంప్రదాయ వృత్తులకు చెందిన ఉత్పత్తులను పరిశీలించి కళాకారులు, వృత్తిదారులను అభినందించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో సంప్రదాయ వృత్తులకు కొత్త ఊపు లభిస్తోందని పేర్కొన్నారు. అనంతరం పూసర్ల కులానికి చెందిన స్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, అక్కడ తయారు చేసిన పూసల దండలను కొనుగోలు చేసి పలువురు ఎమ్మెల్యేల సతీమణులకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారి ఉత్పత్తులను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, పలు సంస్థల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపల్లిలో నేషనల్ హేవే రోడ్డుపై యూ-టర్న్ ఏర్పాటు చేయాలి





జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 16:


రఘునాథపల్లి విద్యుత్తు సబ్–స్టేషన్ ముందు జాతీయ రహదారిపై యూ–టర్న్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ నాయకులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ ఇంజనీయర్ మధుసూదన్ రెడ్డికి గురువారం విజ్ఞప్తి చేశారు. మండలంలోని నిడిగొండలో హైవేపై నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని సబ్–స్టేషన్ ముందు యూ–టర్న్ ఏర్పాటు చేయాలని ఖిలాషాపూర్, మేకలగట్టు, మండేలగూడెం, అశ్వరావుపల్లి, వెల్ది, మచ్చు పహాడ్, నర్మెట తదితర గ్రామాలకు చెందిన పలువరు ఎన్ హె అధికారులకు గతంలో విన్నవించారు. ఈ మేరకు రిజినల్ ఇంజనీయర్ మధుసూదన్ రెడ్డి సబ్. స్టేషన్ ముందు జాతీయ రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పడకంటి రవిందర్, తుమ్మలపల్లి సోమేశ్వర్ తో పాట ఎడ్ల మల్లేష్, బెల్దే శ్రీనివాస్ గుడ్ల శీను, మల్యా నాయక్, సప్తగిరి, లింగయ్యతదితరులు పాల్గొన్నారు.

## శక్తివంచన లేకుండా ప్రజా సంక్షేమానికి పాటుపడతా

- **గ్రంధాలయ చైర్మన్ రాంబాబు**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జులై 16: ఆ భగవంతుడు నాకు ప్రజలకు సేవ చేసే అదృష్టం కల్పించాడు, ప్రజాసేవలో జీవితం గడుపుతారని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. గురువారం రఘునాథపల్లిలో ఆయన నివాస గృహంలో 57వ జన్మదిన వేడుకలను అభిమానులు, శ్రేయోభిలాషులుఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలినాళ్లలో కాంగ్రెస్ పార్టీ క్రియాశీల సభ్యునిగా, ఆ తర్వాత జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా, తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాలతో పాటు జడ్పీటీసీగా



రాజకీయప్రస్థానం ప్రారంభించి, స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆశీస్సులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న తాను సాధ్యమైనంతవరకు శక్తి వంచన లేకుండా ప్రజా సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను గజమాల, పూలమాలలు, బొకేలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, కొమరవెల్లి దేవస్థానం డైరెక్టర్ గొరిగి రవి, రఘునాథపల్లి ఉపసర్పంచ్ దావరి యాకయ్య, పార్టీ ప్రతినిధులు కోళ్ల రవి, లోనే శ్రావణ్, నామాల బుచ్చయ్య, పేర్న రవి, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, పార్టీ ప్రతినిధులు, రాంబాబు యువసేన అధ్యక్షుడు వడ్లకొండ శివప్రసాద్ తోపాటు పాత్రికేయులు పాల్గొన్నారు

## అశ్వారావుపేట తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్‌కు నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

•అధ్యక్షుడిగా ఎం.డి. యాసిన్.. ఉపాధ్యక్షుడిగా ఎం. నాగు.. కార్యదర్శిగా సరివింద్ (కూచిపూడి).



భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట / జూలై 16 / అక్షరం న్యూస్ :- అశ్వారావుపేటలో తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ బలోపేతం, కళాకారుల సంక్షేమం కోసం నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు.

### నూతన కమిటీ వివరాలు

అధ్యక్షుడిగా ఎం.డి. యాసిన్, ఉపాధ్యక్షుడిగా ఎం. నాగు, కార్యదర్శిగా సరివింద్ (కూచిపూడి), కోశాధికారిగా కె. భరత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సంఘ సభ్యులు అభినందించారు.

### సంఘ బలోపేతమే లక్ష్యం

అశ్వారావుపేట తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సాధన కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని సనూతన కమిటీ ఏర్పాటుపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కళాకారుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## బీసీలకు పెద్దపీట వేసిన తెలంగాణ రక్షణ సేన.

•పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియామకం.




పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 16 / అక్షరం న్యూస్ -:

దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప,వారికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో విఫలమయ్యాయని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు బొంగోని శంకర్ గౌడ్,ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తాజాగా ప్రకటించిన 23 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల జాబితాలో 12 స్థానాలను బీసీలకు కేటాయించడం చారిత్రాత్మకమని వారు కొనియాడారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు బొంగోని శంకర్ గౌడ్,ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉద్యమకారుడు, బీసీ బిడ్డ సలేంద్ర కొమరయ్యను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.2001 నుండి తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన కొమరయ్యకు సరైన గుర్తింపు దక్కడం బీసీ సమాజమంతా గర్వించదగిన విషయమని, పార్టీ అధినేత్రి కవిత తీసుకున్న ఈ నిర్ణయం అణగారిన వర్గాలకు గొప్ప రాజకీయ భరోసానిచ్చిందని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి కవిత అనుసరిస్తున్న పాంచజన్యం ఎజెండాలో భాగంగా, కులమతాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీని ముందుకు తీసుకెళు న్నారని వారు వివరించారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు సంబంధించిన కీలక అంశాన్ని నాయకులు ప్రస్తావించారు.సింగరేణి ఏరియాలో గత మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 20న నిరాహార దీక్ష చేస్తానని కవిత ప్రకటించగానే,ప్రభుత్వం దిగివచ్చి జులై 17, 18న మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పార్టీ సాధించిన తొలి విజయమని వారు అభివర్ణించారు. రాబోయే రోజుల్లో పార్టీ అధినేత్రి కవిత మార్గదర్శకత్వంలో బీసీలందరినీ ఏకం చేసి,పెద్దపల్లి గడ్డపై తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేస్తామని వారు స్పష్టం చేశారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామని,బీసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు కవితకు బీసీ బిడ్డలందరి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు కల్వల తిరుపతి,చిలుక ఆనంద్,మల్యాల కరుణాకర్, గుర్రం శ్రీనివాస్,ఓదెల మండల నాయకులు నల్లగొండ స్వామి గౌడ్, సుల్తానాబాద్ నాయకులు, పలువురు పార్టీ కార్యకర్తలు మరియు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 16 / : తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఈదులకంటి రమేష్ ఇటీవల మరణించడంతో వారి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో 50కిలోల బియ్యాన్ని అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు కోట జహంగీర్, పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ తుర్కపల్లి పాముల రాజు గౌడ్,తుర్కపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి యాదగిరి,తుర్కపల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు రొయ్యల మధు, ప్రధాన కార్యదర్శి బొల్లారం జగదీష్, సహాయ కార్యదర్శి బండారి శ్రీను, కాంగ్రెస్ పార్టీ యూత్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ఆకుల వెంకటేష్ 6వార్డ్ మెంబర్ కోట జాన్సన్ పాల్గొన్నారు.

# ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం.. మంత్రి పొంగులేటి





ఖమ్మం జిల్లా / సత్తుపల్లి / జూలై 16 / అక్షరం న్యూస్

:సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తమ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు.అనంతరం ఈ సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. పనుల వేగాన్ని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రాణహితకు మళ్లీ ప్రాణం

•సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి..

•ఖమ్మం ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం ..

సాగునీటి రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం..

•పర్యావరణ, న్యాయ, సాంకేతిక అడ్డంకులన్నీ తొలగించి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం..

•మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఖమ్మం జిల్లా / సత్తుపల్లి / జూలై 16 / అక్షరం న్యూస్ -:తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత--చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు.సీతమ్మసాగర్‌కు చట్టబద్ధ మార్గంలో గ్రీన్ సిగ్నల్‌సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి మరింత వేగవంతం కానుందని తెలిపారు.ఖమ్మం జిల్లా పొలాలన్నింటికీ గోదావరి జలాలుఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



కాళేశ్వరం పునరుద్ధరణ శాస్త్రీయంగానేమేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు.నీటిపారుదల శాఖకు కొత్త దిశ

నీటిపారుదల శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది నియామకం, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో శాఖకు కొత్త ఊపు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాల కోసం, ప్రజల భద్రత కోసం, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**సీతారామ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి..**

**భూసేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తాం..**

**యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు..**

ఖమ్మం జిల్లా / సత్తుపల్లి / జూలై 16 అక్షరం న్యూస్ –:

సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు.

అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.



జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయా యని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయా యని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆలేరులో రూ.2.60 కోట్లతో కచ్చా కాలువలకు శాశ్వత పరిష్కారం





యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 16 / : ఆలేరు పట్టణంలో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రూ. 2.60 కోట్ల వ్యయంతో కచ్చా కాలువలను సీసీ కాలువలుగా నిర్మిస్తున్నట్లు ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బి జన బాలమణి భాస్కర్ తెలిపారు. గురువారం చేపట్టిన కాలువల నిర్మాణ పనులను చైర్‌పర్సన్ బి జన బాలమణి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని తెలుసుకుని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో కచ్చా కాలువల కారణంగా వర్షపు నీరు నిలిచిపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ప్రస్తుతం రూ. 2.60 కోట్లతో చేపట్టిన సీసీ కాలువల నిర్మాణంతో వర్షపు నీటి పారుదల మెరుగుపడి ప్రజలకు శాశ్వత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య సదుపాయాల అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సహకారంతో ఆలేరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ మరియమ్మ మార్క్, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ నర్సయ్య ఆంజనేయులు, పదో వార్డు కౌన్సిలర్లు మల్లెల శ్రీకాంత్, సరిత, 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్ కుమార్, 12వ వార్డు కౌన్సిలర్ జెట్టి సిద్ధిరు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జి, పి నిధులు కేటాయించకుండా విద్యుత్తు బిల్లులు చెల్లించాలనడం విడ్డూరం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 16: గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకుండా జీపీలకు సంబంధించిన విద్యుత్తు బిల్లులను చెల్లించాలని అనడం ఎంత వరకు సమంజసమని రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల చేయకుండా, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు మళ్లించాలని షరతులు విధించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులతో వీధి దీపాల నిర్వహణ, సిబ్బంది జీతాలు, అత్యవసర ఖర్చులు చేస్తున్నామని, వీటికే ఆ డబ్బులు సరిపోక నానా ఇబ్బందులు పడుతుంటే... మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు... విద్యుత్తు బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల అందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తేనే నిధులు విడుదల చేస్తామనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, పెండింగ్ విద్యుత్తు బిల్లులకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొర్ర రాజేందర్ నాయక్, అరూరి మల్లేష్, భూక్య శ్రీను. తూడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు


## ఈ ఆకులతో మధుమేహం, ఊబకాయం రెండింటికీ చెక్.. ఎలాగో తెలుసా..!

ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక అనారోగ్యాలు ప్రబలుతున్నాయి. మధుమేహం, ఊబకాయం లాంటి సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. ఆ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు చాలామంది అనేక ప్రయత్నాలు చేసి కూడా విఫలమవుతున్నారు. అయితే ఈ మధుమేహం, ఊబకాయం సమస్యలకు చెక్ పెట్టేందుకు జామ ఆకులు అద్భుత ఔషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల ఈ రెండు సమస్యలకే కాకుండా అనేక ఇతర అనారోగ్య సమస్యలకు కూడా పరిష్కారం ఉంటుందని అంటున్నారు. జామాకు ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

జామ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి కడుపు పూతల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతాయి. దగ్గు, దురద మొదలైన వాటితో బాధపడుతున్నవారు జామ ఆకులను తినాలి. ఎందుకంటే వీటిలో శరీరానికి ఉపశమనాన్ని అందించే యాంటీ అలర్జీ లక్షణాలు ఉంటాయి. అంతేకాదు జామ ఆకులను వివిధ రూపాల్లో తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మగవారికి మేలు చేస్తుంది. సంతానలేమి సమస్యను దూరం చేస్తుంది. జామ ఆకుల సారాన్ని తీసుకుంటే స్పెర్మ్ నాణ్యత, కౌంట్ పెరుగుతుంది. జామ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి ఉపశమనం అందిస్తాయి. జామ ఆకులను రెగ్యులర్‌గా తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. జామపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో జామ ఆకులతో కూడా అంతకుమించి ప్రయోజనాలు పొందవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబయిల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. జామ ఆకులు క్యాలరీ ఫ్రీ. ఇవి బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. జామ ఆకులను పచ్చిగా తిన్నా కూడా రుచిగా ఉంటాయి. కావాలనుకుంటే జ్యూస్‌లా చేసుకుని తాగవచ్చు. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం ముడతలు మాయమవుతాయి. మొటిమలు, నల్ల మచ్చలను తొలగించడంతో జామ ఆకులు సహాయపడతాయి. జామ ఆకులు హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి.

# ప్రాజెక్టుల నిర్వహణలో సర్కారు విఫలం




- కాళేశ్వరం ఉన్నా.. కరువు ఎందుకు..
- ప్రాజెక్టుల నిర్వహణలో సర్కారు విఫలం.
- గోదావరి పారినా గడప దాటని సాగునీరు.
- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్.

పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 16 / అక్షరం న్యూస్ –:

రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో రైతాంగం అల్లాడుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమల్ల రాకేష్ కుమార్ ధ్వజమెత్తారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జిల్లాలో సాగునీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి అది కేవలం 12 వేల ఎకరాలకే పరిమితమైందని రాకేష్ కుమార్ గణాంకాలతో సహా వివరించారు. డీ–83, డీ–86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడం, ఎల్లమ్మ చెరువుతో సహా జిల్లాలోని పలు చెరువులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. 20 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఇది తాగునీటి అవసరాలకే సరిపోని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా, వాటిని ఒడిసిపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వం నిర్మించిన మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ,కాళేశ్వరం ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నా,నేడు సరైన నిర్వహణ లేక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయని ఆరోపించారు. సమీపంలోనే గోదావరి ప్రవహిస్తున్నా, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారం,సుందిళ్ల బ్యారేజీలను నింపి,ఎల్లంపల్లికి నీటిని తరలించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి, ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధిని పక్కనపెట్టి పదవుల పంపకాల పంచాయతీల్లోనే మునిగిపోయారని దుయ్యబట్టారు. రక్తం చిందితే పంటలు పండుతాయి అని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, పంటలు పండుతాయి అనుకుంటే, ఎవరి రక్తం వాడాలో ప్రజలే నిర్ణయిస్తారు అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన రాకేష్ కుమార్,రైతు భరోసా, సన్న బియ్యం బోనస్,ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే,రైతుల పక్షాన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి, మేకల కుమార్ యాదవ్,కర్రె దేవేందర్ రెడ్డి, ఉప్పు శివ కుమార్, పోసాని శ్రీనివాస్ యాదవ్, బోయిని మనోజ్, కంచి నాగరాజు, పాయిలి కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి రూరల్ / జూలై 16 / అక్షరం న్యూస్ –:

భూ భారతి ద్వారా చేపడుతున్న రీ–సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భూ భారతి రీ–సర్వే అవగాహన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, భూముల విస్తీర్ణంలో తేడాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర రీ–సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలోని 190 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశలో 70 గ్రామాలను రీ–సర్వేకు ఎంపిక చేశామని, వాటిలో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు. ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాల సహాయంతో సర్వే చేస్తామని చెప్పారు. సర్వే అనంతరం భూ వివరాలను గ్రామాల్లో ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇచ్చి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ–సర్వేతో 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని వెల్లడించారు. రీ–సర్వే జరుగుతున్న సమయంలో రైతులు, భూ యజమానులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. రోజుకు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని, ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలియజేస్తామని చెప్పారు. ఈ రీ–సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడతాయని, ఆధార్ తరహాలో భూధార్ కార్డుల జారీకి ఇది కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దత్తాయపల్లి గ్రామంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 16 / : దత్తాయపల్లి గ్రామానికి చెందిన పల్లపు దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం రోజున మృతుని దశ దిన కర్మ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీమతి బీర్ల అనితమ్మ సహకారంతో మృతు రాలి కుటుంబానికి 50 కిలోల బియ్యంను స్థానిక సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు ధ్యానబోయిన నవీన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గుంటి రాజు యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జేరిపోతుల చంద్రయ్య ద్వారా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గాదే మల్లేశ్, పల్లపు వెంకటయ్య, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ధ్యాన బోయిన నరేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు, ఎండీ జమీల్, యువజన నాయకులు, ధ్యాన బోయిన ప్రవీణ్, దేవరుప్పల పవన్, జేరిపోతుల సాయి, గొట్టే అజయ్, కొండశీ మనీ, ఆవుల వేణు, మింటు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 2 నుండి 18 వరకు జరుగు కల్లుగీత అమరుల యాది లో బస్సు యాత్రను జయప్రదం చేయండి

- **కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలగానీ జయరాములు.**



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 16 / : తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత వృత్తి రక్షణ కోసం. హక్కుల కోసం పనిచేసి అమరులైన కల్లుగీత కార్మిక సంఘం నాయకులను స్మరిస్తూ గ్రామాలలో సభలను నిర్వహిస్తూ , ఆశయాలను మరొక్కసారి మననం చేస్తూ ఇప్పుడు వృత్తి రక్షణ కోసం హక్కుల సాధన కోసం పునరాంకితం సంఘం నాయకులు గీత కార్మికులు కావడానికి ఆగస్టు 2 మానుకోట జిల్లా కేంద్రంలో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాదులో పాపన్న జయంతిన ముగుస్తున్న ఇట్టి కార్యక్రమాన్ని కల్లుగీత కార్మిక సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగానీ జయరాములు గీత కార్మికులను కోరారు. తేదీ.16.07.2026 రోజున భువనగిరి పట్టణంలోని వైయస్సార్ ఫంక్షన్ హాల్ లో కల్లుగీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రాగిర్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగినది. ఇట్టి సమావేశంలో అమరులు యాది లో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. తదుపరి జరిగిన సమావేశంలో పాల్గొని జయరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షల మంది గీత కార్మికులు వృత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చేతివృత్తులలో అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తిని ఈ వృత్తి రక్షణకు కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడం వృత్తిలో ప్రమాదానికి గురై ఎక్స్ గ్రేషియా మంజూరై గీత కార్మికులకు రావలసిన డబ్బులను విడుదల చేయకపోవడం గీత కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తన మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు అనేక రకమైన వాగ్దానాలు ఇచ్చిందని ఇప్పటివరకు వాటిని అమలు చేసిన పరిస్థితి లేదని అందుకే కల్లుగీత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో సంఘం నాయకత్వన జరిగిన పోరాటాల వల్ల అనేక హక్కులను సాధించుకున్న చరిత్ర కల్లు గీత కార్మికులదని ఇప్పుడు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వాలను ఉద్యమాల ద్వారా ఒత్తిడి తెస్తానే తమ సమస్యల పరిష్కారం అవుతాయని అందుకు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులలో చైతన్యం తీసుకురావడానికి ఈ బస్సు యాత్ర ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ బస్సు యాత్ర ఆగస్టు 9న యాదాద్రి భువనగిరి జిల్లాకు వస్తుందని జిల్లాకు వచ్చిన సందర్భంలో కల్లుగీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని స్వాగతం తెలిపి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య. కొండ అశోక్. అంతటి అశోక్ , జిల్లా ఆఫీస్ బేరర్స్ మరియు జిల్లా కమిటీ సభ్యులు రాంపల్లి సోములు, కోరుకోప్పల కిష్టయ్య , ఎరుకల బిక్షపతి.భామండ్ల పెల్లి బాలరాజు , మారగోని అశోక్.కొక్కొండ లింగయ్య , గడ్డం దశరథ, మల్లెగోని లక్ష్మయ్య , కూనూర్ మల్లేష్వ, మరగోని శ్రీ రామూర్తి , పాండవుల లక్ష్మణ్ ,చేరుకు బాలరాజు. పంజాల నర్సయ్య , పర్కాలఅంజయ్య , కుర్మెండ్ల ఈశ్వర్, బతిని సత్యనారాయణ , సార ఐలయ్య, కొల కృష్ణ, పూజారి సైదులు, మునుకుంట్ల లెనిన్, తాళ్ళ పల్లి అంజయ్య , పరశురాములు తదితరులు పాల్గొన్నారు


# ఫీజు రియంబర్స్మెంట్ నిర్లక్ష్యం చేస్తే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

- **విద్యార్థులకు అండగా నిలుస్తాం**
- **ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి.**
- **ఆర్. కృష్ణయ్య చేపట్టే దీక్షకు మద్దతుగా నిలుస్తాం.**
- **బేరి రామచందర్ యాదవ్**



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష ద్వారా విద్యార్థులకు ఫీజు బకాయిలు, స్కాలర్షిప్లు, ఉద్యోగాలు, తక్షణమే అందజేయాలని చేపడుతున్న దీక్షకు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తామని తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ డిమాండ్ పేర్కొన్నారు. బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాల విద్యార్థులకు అండగా నిలిచి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలి చెల్లించాల్సిన ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్తుల దృష్టిలో ఉంచుకొని ఫీజులు, స్కాలర్షిప్లు, ఉద్యోగాలు, తక్షణమే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల కోసం ఆర్ కృష్ణయ్య చేపట్టే ఇలాంటి దీక్ష కైనా తాము అండగా నిలుస్తామని తెలిపారు. హైదరాబాదులోని ధర్నా చౌక్ వద్ద ఆర్ కృష్ణయ్య చేపట్టిన దీక్షకు అనూహ్య స్పందన లభించిందన్నారు. విద్యార్థుల కోసం చేస్తున్న దీక్షకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు అనంతరం ఆర్ కృష్ణయ్య కలిసి ఆయన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భేరి రామచందర్ యాదవ్ తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు కె.సాయన్న ముదిరాజ్ తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక బిసి ఫెడరేషన్ ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్, గండి మైసమ్మ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్, పులి రాజేందర్, నోముల ప్రవీణ్ కుమార్, బీసీ నాయకులు అన్నానగర్ అధ్యక్షులు శ్రీశైలం గౌడ్, ఉప్పల్ అధ్యక్షులు ఎంవిఎస్ నాయక్, కీర్తి కుమార్, కుల్చారం అధ్యక్షులు మురళీధర్, గజ్వేల్ అధ్యక్షులు ఇస్మాయిల్, యువజన అధ్యక్షులు కొంటు సుమన్, సిద్ధార్థ ముదిరాజ్, శీను పటేల్, అనేకమంది బీసీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో బేరితో పాటు మద్దతుగా నిలిచి ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# మొక్కల ఆహారంతోనే ఆరోగ్యం!



మొక్కల ఆధారిత ఆహారాలే మన ఆరోగ్యాన్ని కాపాడుతాయి. పండ్లు, కూరగాయలు, గింజలు, విత్తనాలు, చిక్కుళ్లు లాంటివి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా, పిల్లల్లో సాధారణ ఎదుగుదల, అభ్యాసం, మానసిక స్థితి, దీర్ఘకాలిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. అందుకు కావాల్సిన పోషకాలన్నీ వీటిలో పుష్కలంగా ఉంటాయి. అయితే, నేటితరం పిల్లలు.. ఈ ఆరోగ్యకరమైన ఆహారానికి దూరం అవుతున్నారని తాజా అధ్యయనం బయటపెట్టింది.

అమెరికాలోని టఫట్స్ విశ్వవిద్యాలయం ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ సందర్భంగా.. పిల్లల వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యకరమైన మొక్కల ఆధారిత ఆహార వినియోగం తగ్గుతూ వస్తున్నట్లు గుర్తించింది. 'బీఎమ్జే గ్లోబల్ హెల్త్' జర్నల్లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ఇందులో భాగంగా.. 'గ్లోబల్ డైటరీ డేటాబేస్' నుంచి ఆహార సంబంధిత సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. 185 దేశాల నుంచి 1,200 కంటే ఎక్కువ ఆహార సర్వేల డేటాను ఉపయోగించి రిపోర్టును తయారు చేశారు. 1990 -- 2018 మధ్య కాలంలో ఐదు రకాల ఆరోగ్యకరమైన మొక్కల ఆధారిత ఆహారాల వినియోగాలను విశ్లేషించారు. ఆశ్చర్యకరంగా.. పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు చాలా తక్కువ మొత్తంలో మొక్కల ఆధారిత ఆహారాన్ని తింటున్నారని పరిశోధకులు కనుగొన్నారు. ఇందుకు కారణాలను వివరిస్తూ.. పిల్లల్లో ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ సంస్కృతి పెరిగింది. చిప్స్, బర్గర్లు, పిజ్జాలతోపాటు ఇన్స్టంట్గా దొరికే జంక్ ఫుడ్కే పిల్లలు, యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఆధునిక జీవనశైలి, సమయాభావం వల్ల కూడా చాలామంది ఆకుకూరలు, కూరగాయలను తాజాగా వండుకుని తినలేక పోతున్నారు. అంతేకాకుండా.. టీవీలు, సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయమైన ప్యాక్డ్ ఫుడ్స్ ప్రకటనలకు పిల్లలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నారు. ఫలితంగా.. లేనిపోని అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా, శారీరక, మానసిక ఎదుగుదల లోపించడం, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, చిన్న వయసులోనే ఊబకాయం, మధుమేహం లాంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి ఆహారంలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. రోజువారీ భోజనంలో కనీసం ఒక కప్పు కూరగాయలు, పండ్లను భాగం చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. బాల్యంలో ఏర్పడే ఆహారపు అలవాట్లే జీవితాంతం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయనీ, అందుకు తగ్గట్టుగా పిల్లలను ప్రోత్సహించాలని అంటున్నారు.

## ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే గొంతు పొడిబారే సమస్య.. ఎందుకు వస్తుంది..

శీతాకాలం ముగిసి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమైనప్పుడు, చాలా మందిలో ఒక సాధారణ సమస్య కనిపిస్తుంది. చాలా మందికి ఉదయం లేవగానే గొంతు ఎండి పోయినట్టు, గరుకుగా లేదా గొంతు బిగుసుకున్నట్టు అనిపిస్తుంది. వసంత కాలం పూలతో అందంగా ఉన్నప్పటికీ, అదే సమయంలో గాలిలో పుప్పొడి స్థాయిలు పెరుగుతాయి, వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ మార్పులు శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి గొంతు అసౌకర్యానికి కారణమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔహూ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అలర్జీ సంబంధిత శ్వాస సమస్యలతో బాధపడుతున్నారు. భారతదేశంలో వసంత కాలంలో చెట్లు, గడ్డి నుంచి వచ్చే పాలెన్, ధూళి, కాలుష్యం, తేమ మార్పులన్నీ కూడా గొంతు, శ్వాసనాళాలపై ప్రభావం చూపుతాయి.

**కారణాలు ఇవే..**

అలాగే వసంతకాలంలో గొంతు ఎండిపోయినట్టు, పొడిగా అనిపించడానికి అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వసంత కాలంలో మొక్కలు పెద్ద మొత్తంలో పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ చిన్న కణాలు శ్వాసలోకి వెళ్లినప్పుడు శరీరం హిస్టమిన్స్ ను విడుదల చేస్తుంది. దీంతో ముక్కు, గొంతులో వాపు వస్తుంది. దీని వల్ల గొంతు ఎండిపోవడం, దురద, దగ్గు, గొంతు గరుకుగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గొంతులో చికాకుకు మరో సాధారణ కారణం పోస్ట్-నాసల్ డ్రిప్. ఈ పరిస్థితిలో మ్యూకస్ గొంతు వెనుక భాగంలో చేరుతుంది. ఇది నిరంతరం గొంతులోకి జారుతుంది. దీంతో నిరంతరం చికాకు, దగ్గు, గొంతు సవరించడం, గొంతు గరగర వంటి లక్షణాలు ప్రేరేపించబడతాయి. అలాగే వసంత కాలంలో ఉష్ణోగ్రతలు మారుతుంటాయి. పొడి గాలులు, ధూళి పెరుగుతాయి. కాలుష్యం ఎక్కువ అవుతుంది. ఇవి గొంతు ఎండిపోవడానికి కారణమవుతాయి. వీటితో పాటు ఇండోర్ వాతావరణాలు కూడా ఈ సమస్యకు దోహదం చేస్తాయి. ᅳజ గదుల్లో తేమ తగ్గిపోవడం వల్ల గొంతు, ముక్కు ఎండిపోతాయి. ఇంట్లోని పొడి గాలి శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి అలెర్జీలు ఉన్న వారిలో లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి.

## డయాబెటిస్‌తో మతిమరుపు...

డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కడ పెరిగిపోతాయోననే భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి.

## పేపర్ బ్యాగే ఎందుకు?

మన ఇంట్లో మామిడి, అరటిపండు వంటివి సరిగా పండకపోతే పేపర్ బ్యాగ్‌లో పెట్టడం చూస్తున్నాం. కానీ, ఎప్పుడైనా అది ఎలా సాధ్యమవుతుందో గమనించారా? మనలో చాలామంది గొప్ప చెఫ్స్, సెలెబ్రిటీలు చెప్పిన చిట్కాలు చదవడానికి ఆసక్తి చూపిస్తున్నాం. కానీ, ఒక్కసారి మన ఇంట్లో మన నానమ్మ, అమ్మ చేసే ఈ చిన్ని మ్యాజిక్‌ను గమనించారా? కొన్ని దశాబ్దల నుంచి ఇలా చేస్తూ వస్తున్నారు. కాలక్రమేణ 'ఎలా.. ఎందుకు' అనే ప్రశ్నలు అడగకపోవడం వల్ల మర్చిపోయిన ఈ మ్యాజిక్ వెనుక రహస్యాన్ని తెలుసుకుందాం. పండ్లలో రెండు రకాలు క్లైమెటిక్, నాన్‌క్లైమెటిక్ అని ఉంటాయి. ఎథిలీన్ విడుదల చేసేవి.. విడుదల చేయనివి. ఎథిలీన్ విడుదల చేసే పండ్లు క్లైమెటిక్ కోవకు చెందినవి. ఇవి పండటానికి చెట్టుకే ఉండనవసరం లేదు. చెట్టు నుంచి కోసిన తరువాత కూడా ఇలా పేపర్ బ్యాగ్‌లో ఉంచితే గ్యాస్ విడుదల చేసి పండుతాయి. కానీ, పుచ్చకాయ, నిమ్మ, చెర్రీ, దోసకాయ వంటి నాన్‌క్లైమెటిక్ పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత పక్వానికి రావు. ఎథిలీన్‌ను విడుదల చేయవు కాబట్టి, వీటిపై ఈ చిట్కా పనిచేయదు. అవి పండాలంటే కచ్చితంగా చెట్టుకే ఉండాలి. లేకపోతే తగిన రుచి, పక్వం, తీపిని సమకూర్చుకోలేవు.

### ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెడితే..?

పేపర్ బ్యాగ్‌లోనే ఎందుకంటే ఆపిల్, మామిడి, కివీ, పీచ్, అవకాడో వంటి పండ్లు పక్వం చెందే సమయంలో 'ఎథిలీన్' అనే సహజ వాయువును విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలో కార్బన్ డయాక్సైడ్, ఆక్సిజన్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. కార్బన్ డయాక్సైడ్‌ను బంధించకుండా దానికి తగిన తోవను చూపడంలోనూ, ఆక్సిజన్ లోపలికి వచ్చే వెసులుబాటును పేపర్ బ్యాగ్ కల్పిస్తుంది. ఈ పండ్లను ప్లాస్టిక్ కవర్‌లో ఉంచితే కార్బన్ డయాక్సైడ్ బయటికి వెళ్లే అవకాశం లేక, ఆక్సిజన్ లోనికి వచ్చే మార్గం లేక.. పండ్లు కుళ్లిపోతాయి.

## ప్రొటీన్‌కు ప్లేస్ ఇవ్వండి..

నేడు ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న, ఎక్కువ సెర్చ్ చేస్తున్న పదాల్లో ప్రొటీన్ అగ్రభాగాన ఉంటున్నది. మజిల్ బిల్డింగ్, శక్తి సంగ్రహణ కంటే కూడా ఈ పదమే ఎక్కువ పాపులర్ అంటే నమ్ముతారా? శరీరాన్ని బాగు చేయడమే కాదు మెటబాలిక్ ప్రక్రియకు, రోగనిరోధక శక్తిలో కీలక పాత్ర పోషిస్తుంది ప్రొటీన్. ఇన్ని లాభాలున్నాయనే ప్రొటీన్‌ను ఎక్కువ మంది ఖరీదు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇది సంపన్నులకు మాత్రమేనా? సామాన్యులకు కూడా ఈ లాభాలు చేకూరే అవకాశం లేకపోలేదు. పప్పులు, వేయించిన శనగలు, మొలకెత్తిన విత్తనాల్లో పుష్కలంగా ప్రొటీన్ దొరుకుతుంది. పాలు తీసుకుంటే క్యాల్షియంతోపాటు ప్రొటీన్ వస్తుంది. పెరుగుతో మంచి బ్యాక్టీరియా అందుతుంది.

# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

**బోర్డు పరీక్షలకు పునాది వేసే మస్యంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య**




న్యూఢిల్లీ,జూలై16 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది.

ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

## సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన

**అతడిని కాపాడాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం**



న్యూఢిల్లీ,జూలై 16 పర్యావరణ ఉద్యమ కారుడు సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకు పైగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు. తాజాగా తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ఒక వీడియో విడుదల చేశారు. నా ఆరోగ్యం క్షీణించిన మాట వాస్తవమే. కానీ అత్యంత ప్రమాదకర స్థితికేం దిగజారలేదు. నిరాహార దీక్ష విరమించాలని నన్ను అడగడానికి బదులు జులై 20న 'చలో సంసద్' పేరిట పార్లమెంట్ వరకు నిర్వహించే శాంతియుత మార్చ్‌లో భాగం కావాలని మద్దతుదారులను ఆయన కోరారు.

## డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదు

మహిళా బిల్లుతో వారి సాధికారితకు అవకాశం

బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం

న్యూఢిల్లీ,జూలై16 డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. వికసిత భారత్ - 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగ నున్నాయని లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళాబిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశర చేస్తాయని పేర్కొన్నారు.

# దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు !



న్యూఢిల్లీ,జూలై16 మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది. దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం

**5 లక్షలకు 111 ప్రశ్నలు విక్రయం**

**సిబిఐ నివేదికలో వెలుగులోకి కీలక విషయాలు**




న్యూఢిల్లీ,జూలై16: నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రాల సెట్లలోని 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయని సీబీఐ తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు వివరాలను ప్రత్యేక కోర్టుకు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో సీబీఐ పలు కీలక ఆధారాలను ప్రస్తావించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ÷ు౦) ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడైన పీవీ కులకర్ణి నుంచి నీట్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు శివరాజ్ కుమారుడు హాజరయ్యాడని పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా శివరాజ్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో 36 ఫొటోలు లభించినట్లు సీబీఐ తెలిపింది. వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉండగా.. అందులో 111 ప్రశ్నలు నీట్ యూజీ 2026 మాస్టర్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు వెల్లడించింది. రసాయన శాస్త్ర ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ నిందితుడు రాసినవేనని తాము భావిస్తున్నట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు ఈ ఫొటోలు తీసినట్లుగా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేయగా.. వారందరూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు సీబీఐ తెలిపింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నీట్- ప్రశ్నపత్రం లీక్ కేసులో సీబీఐ ఢిల్లీ కోర్టుకు కీలక వివరాలు వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ మోటెగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 136 చేతిరాత ప్రశ్నల్లో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన క్వశ్చన్ పేపర్ సెట్‌తో సరిపోలినట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది.

లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ నిర్వహిస్తున్న శివరాజ్ మోటెగావ్‌కర్, 'మోటెగావ్‌కర్ సర్‌స్ ఆర్‌సీసీ' పేరుతో సుమారు 1.68 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. అతను ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను సీబీఐ పరిశీలించగా, అందులో కెమిస్ట్రీకి సంబంధించిన 132 చేతిరాత ప్రశ్నలు ఉన్న 36 ఫొటోలు లభించాయి. వాటిలో ఐదు ఫొటోలు ఒకే విధంగా ఉండగా, మిగిలిన ఫొటోల్లో ఉన్న చేతిరాత ప్రశ్నలు శివరాజ్ మోటెగావ్‌కర్ రాసినవేనని సీబీఐ భావిస్తోంది. సీబీఐ దర్యాప్తు ప్రకారం.. మే 3న జరిగిన నీట్-యూజీ 2026 పరీక్షకు దాదాపు 10 రోజుల ముందే, అంటే ఏప్రిల్ 23న శివరాజ్ మోటెగావ్‌కర్‌కు లీకైన ప్రశ్నలు అందినట్లు తెలుస్తోంది. లాతూర్‌కు చెందిన డాక్టర్ మనోజ్ శిరూరే, మాజీ ఎన్‌టీఏ ప్యానెల్ సభ్యుడు, రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణి ద్వారా ఈ ప్రశ్నలు మోటెగావ్‌కర్‌కు చేరినట్లు సీబీఐ తెలిపింది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు కూడా ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే మోటెగావ్‌కర్‌ను అరెస్టు చేసిన సీబీఐ, అతని బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఢిల్లీ కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. అలాగే, లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల 'అంచనా ప్రశ్నపత్రం'ను కొంతమంది అభ్యర్థులకు అందించినట్లు సీబీఐ తెలిపింది. అందులోని సుమారు 120 ప్రశ్నలు నీట్-యూజీ 2026 కెమిస్ట్రీ ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలతో సరిపోలినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో పరీక్షకు ముందే ప్రశ్నపత్రంలోని కీలక ప్రశ్నలు కొందరి చేతికి చేరినట్లు సీబీఐ దర్యాప్తులో గుర్తించింది.

# ఆగస్ట్ 15న రానున్న హుషారు పిట్టలు




అన్ను, వాసవి గణేషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.

దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు. హీరోయిన్ వాసవి గణెశిషన్ మాట్లాడుతూ.. దర్శకుడు, నిర్మాత సజేషన్‌తో ఈ సినిమా చేశాను. సురేష్ ప్రొడక్షన్స్, బెక్కెం వేణుగోపాల్ సహకారంతో ఈ సినిమా స్టాం÷-రగ్ అయ్యింది. టోంగా.,. టోంగా పాట అందరికి నచ్చుతుంది. ఈ సినిమా టీజర్‌తో నాకు చాలా నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. అయితే వాసవి గణెశిషన్ వేరు? పుట్ట చిట్టి వేరు.. ఎవ్వరూ ఏమనుకున్నా సినిమా చూసిన తరువాత మీరు కూడా అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను' అన్నారు.


## 23న జననాయగన్ రిలీజ్... పోస్టర్ విడుదల




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. 'అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.

# మైదానంలో తీవ్ర ఉద్రిక్తత

### అర్జెంటీనా ప్లేయర్ తలపై కొట్టిన ఇంగ్లాండ్ స్టార్




ఫిఫా వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఊహించని షాకింగ్ డ్రామా నడిచింది. అర్జెంటీనా చేతిలో 2-1 తేడాతో ఇంగ్లాండ్ ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే, రెఫరీ ఫైనల్ విజిల్ వేసిన వెంటనే, మ్యాచ్‌ను గెలిచిన ఆనందంలో అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఓటమి భారంతో కోపంతో ఊగిపోయిన బెల్లింగ్‌హామ్, ఒక అర్జెంటీనా ఆటగాడి వద్దకు వెళ్లి అతడి తలపై కొట్టాడు. దీంతో మైదానంలో ఒక్కసారిగా ఉత్కంఠ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి మ్యాచ్ చివరి నిమిషం వరకు ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. చివరి నిమిషాల్లో కమ్ బ్యాక్ ఇచ్చిన అర్జెంటీనా.. వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. దీంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడి, నిరాశకు గురయ్యారు. మ్యాచ్ ముగిశాక అర్జెంటీనా ఆటగాళ్ల సంబరాలు స్లెడ్జింగ్ బెల్లింగ్‌హామ్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. దీంతో సహనం కోల్పోయిన జూడ్.. అర్జెంటీనా ఆటగాడు బార్కో తలపై కొట్టాడు. బార్కో ఏదో అన్న తర్వాతే జూడ్.. కొట్టినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు వెంటనే బెల్లింగ్‌హామ్‌ను చుట్టుముట్టారు. దాంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఎత్తున తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. మైదానంలో వాతావరణం మరింత వేడెక్కడంతో వెంటనే మిగతా ఆటగాళ్లు.. కగలజేసుకుని, ఇద్దరికీ సర్ది చెప్పారు. ఇక ఇదే మ్యాచులో మెస్సీతోనూ ఓ దశలో ఇంగ్లాండ్ స్టార్ బెల్లింగ్‌హామ్ వాగ్వాదానికి దిగాడు. క్రికెట్‌లో భారత్, పాక్ మ్యాచ్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో.. ఫిఫా ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు అంతే క్రేజ్ ఉంది. ఫాక్ లాండ్ దీవుల కోసం 1982లో ఈ రెండు దేశాల మధ్య సుమారు 74 రోజుల పాటు ఘర్షణ జరిగింది. ఇంగ్లాండ్ పైచేయి సాధించడంతో.. అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన సుమారు 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇది గుర్తుపెట్టుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు మ్యాచ్ తర్వాత 'ఫాక్ లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడం గమనార్హం. దీంతో ఈ విషయంపై ఇప్పటికీ రెండు దేశాల మధ్య వైరం కొనసాగుతోందని స్పష్టమైంది.

## వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7

- టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10
- వన్డే, టి20 ప్రపంచకప్‌లలో కీలక మార్పులు
- వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ నుంచి అమలు

రాబోయే ఐసీసీ టోర్నీల ఫార్మాట్లలో కీలక మార్పులు చూడబోతు న్నాం. 2027 వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7 దశ జరగనుంది. 2028 టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10 నిర్వహించనున్నారు. టోర్నీలపై ఆసక్తిని జట్ల మధ్య పోటీని పెంచేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని ఐసీసీ తెలిపింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 10 జట్లు పోటీపడగా.. వచ్చే ఏడాది 14 జట్లు తలపడనున్నాయి. 10 జట్లు నేరుగా టోర్నీకి అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్స్ ద్వారా మరో నాలుగు జట్లు ఎంపికవుతాయి. 11వ స్థానంతో ప్రపంచకప్‌నకు వచ్చే జట్టు.. నేరుగా గ్రూప్ దశలో తలపడుతుంది. 12, 13, 14వ స్థానాలతో టోర్నీకి అర్హత సాధించిన జట్లు గ్రూప్ దశకు ముందు 'సూపర్ సిరీస్' రౌండ్ ఆడతాయి. ఇందులో అగ్రస్థానం దక్కించుకున్న టీమ్ గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది. గ్రూప్ దశలో 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి 3 జట్లు, మొత్తంగా నాలుగో ఉత్తమ టీమ్ సూపర్-7 దశకు చేరుకుంటాయి. అక్కడ రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడి టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. సంయుక్త ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా ప్రపంచకప్‌నకు అర్హత పొందుతాయి. నమీబియా అసోసియేట్ దేశం కావడంతో అర్హత టోర్నీ ఆడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే కాకుండా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 8 ఉత్తమ జట్లు టోర్నీకి అర్హత పొందుతాయి. టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 విధానానికి బదులు సూపర్-10ను ప్రవేశపెట్టింది ఐసీసీ. మొదట 20 జట్లను అయిదు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి రెండు టీమ్‌లు సూపర్-10 దశకు చేరుకుంటాయి. ఇక్కడ అయిదేసి జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి అగ్రస్థా నంలో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీస్‌కు చేరుతాయి. మిగతా రెండు బెర్తుల కోసం 2వ స్థానంలో ఉన్న జట్లు ప్రత్యర్థి గ్రూప్‌లోని మూడో స్థానంలో ఉన్న టీమ్‌లను ఢీకొంటాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీస్ చేరుకుంటాయి. 2028లో జరిగే టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

## ప్రభాస్ ఫౌజీ డిసెంబర్ 3న లాక్

### రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల




ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మూడేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా

### నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే: అఖిల్




మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609